
సాక్షి
గుంటూరు
మంగళవారం । 27 । జూన్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానం.



హుండీ లెక్కింపు రేపు

పెదకాకాని: భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు.



దుర్గమ్మ సేవలో జస్టిస్ సుజాత

విజయవాడ: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం దర్శించుకున్నారు. సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

విత్తన దుకాణాల్లో తనిఖీలు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరులోని రాజాగారితోట, పట్నంబజారు, ఏటుకూరు రోడ్ ప్రాంతాల్లోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన అనుమతి పత్రాలు చూపని కారణంగా రూ.26,25,937 విలువ గల 136.80 కిలోల మిరప, పత్తి, కూరగాయల విత్తనాల అమ్మకాలు నిలిపి వేశారు. ఏడీఏ సీహెచ్ సునీత మాట్లాడుతూ విత్తనాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందితే దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను డీలర్లు తప్పక పాటించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏడీఏ టి.శ్రీనివాసరావు, సీహెచ్ తిరుమలాదేవి, ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, ఐ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అయ్యవార్ల 'అతి'క్రమణపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు చేస్తున్న అతిపై సోమవారం డీఈఓ శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూళ్లలో చేరేందుకు వస్తున్న విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠం చదవమనటం, ఎవరైనా చదవలేకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తూ కొందరు ప్రధానోపాధ్యాయులు సొంత రూల్స్ అమలు చేస్తున్న నేపథ్యంలో 'అయ్యవార్ల అతిక్రమణ' శీర్షికన సోమవారం 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి శైలజ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు తెనాలి ఉప విద్యాశాఖాధికారి నిర్మల, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ విచారణ జరిపారు. సొంత నిబంధనలు అమలుచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని గుర్తించి, లిఖితపూర్వక సంజాయిషీ అడిగారు. నిబంధనల ప్రకారం అడ్మిషన్ కోరి వచ్చిన విద్యార్థులను చేర్చుకోవాలని స్పష్టంచేశారు. ఇలాంటివి పునరావృతం కారాదని హెచ్చరించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.54 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 20 రోజులకు రూ.3,54,87,284 నగదు, 666 గ్రాముల బంగారం, 7.752 కిలోల వెండి సమకూరిందని ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. రోజుకు సరాసరిన రూ.17.74 లక్షల ఆదాయం హుండీల ద్వారా వచ్చిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపును పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు అనురాధ, పోలీసులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షించారు. ఇక ఈ హుండీ ద్వారా రూ.36,153 విరాళాలను భక్తులు సమర్పించారు.

38,882 మిర్చి బస్తాల రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 38,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,599 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.9,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 13,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. యార్డులో ఇంకా 14,641 బస్తాలు మిర్చి నిల్వ ఉంది.

అమ్మఒడి శుభ'మనీ'

రేపు నాలుగో విడత ఆర్థిక లబ్ధి

- గుంటూరు జిల్లాలో ఎంపికైన 1,59,594 మంది మాతృమూర్తులు
- రూ.239.39 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చనున్న ప్రభుత్వం
- గ్రామ, వార్డు సచివాలయాల వారీగా జాబితాల ప్రదర్శన
- తల్లులచే బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేయిస్తున్న వలంటీర్లు
- రేపు జిల్లాస్థాయిలో కార్యక్రమం
- ఈనెల 30 నుంచి మండలాల వారీగా జగనన్న అమ్మఒడి కార్యక్రమాలు



గుంటూరు ఎడ్యుకేషన్: పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లులకు జగనన్న అమ్మఒడి నాలుగో విడత ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం ఈనెల 28న బుధవారం అందించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో తుది దశకు చేరాయి. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థుల్లో అర్హులను గుర్తించి, ఎంపిక చేసిన ప్రభుత్వం వారి మాతృమూర్తుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. ఇప్పటికే అమ్మఒడి అర్హుల జాబితాలను ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 1,59,594 మంది మాతృమూర్తులకు రూ.15వేల చొప్పున రూ.239.39 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని సర్కారు అందించనుంది. లబ్ధిదారుల జాబితాలను ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. అలాగే గుంటూరు జిల్లాకు సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా ఈనెల 30 నుంచి మండలాల వారీగా పాఠశాలల్లో జగనన్న అమ్మఒడి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా(రూ.కోట్లలో)

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019–20	1,46,232	219.34
2020–21	1,55,330	232.99
2021–22	1,64,601	246.90
2022–23	1,59,594	239.39

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అమ్మఒడి ఆర్థిక ప్రయోజనాన్ని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించే లబ్ధికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంతో పారదర్శంగా నిర్వహించారు. వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, మాతృమూర్తులతో బయోమెట్రిక్ అథంటెఫికేషన్ నమోదు చేస్తున్నారు. సోమవారం రాత్రికి ఈ ప్రక్రియ పూర్తికానుంది.

• విద్యుద్దీప ప్రకాశం

ఒక వైపు కృష్ణమ్మ గలగలలు.. మరో వైపు రంగు రంగుల విద్యుత్ దీప కాంతుల ధగధగలతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ కాంతులీనుతోంది. విద్యుత్ దీపాల వెలుగుల్లో సరికొత్త శోభను సంతరించుకుని సందర్శకులకు కనువిందు చేస్తోంది. నగర వాసులతోపాటు సమీప ప్రాంతాల ప్రజలు సకుటుంబ సమేతంగా తరలివచ్చి బ్యారేజీ అందాలను తిలకిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

- జగనన్న కాలనీలపై అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సమీక్ష
- నత్తనడక పనులపై ఆగ్రహం
- అమర్తలూరు, భట్టిప్రోలు ఏఈలపై చర్యలకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్

బాపట్ల: జగనన్న లేఅవుట్లలో భూమి చదును చేసే పనులు సత్వరమే పూర్తిచేయకపోతే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా హెచ్చరించారు. జగనన్న లేఅవుట్లు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో పనులను రెండున్నరేళ్లుగా ఎందుకు పూర్తిచేయలేదని అధికారులను కలెక్టరు నిలదీశారు. అమర్తలూరులో 30 పనులు పెండింగ్‌లో ఉండగా.. భట్టిప్రోలు మండలంలో 42 పనులు పురోగతి లేకపోవడంపై కలెక్టరు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ రెండు మండలాల ఏఈలను సస్పెండ్ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు. చుండూరు మండలంలో 35 పనులు మంజూరు కాగా 34 పనులు పెండింగ్‌లో ఉండడంపై ఏఈకి షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. అన్ని మండలాలలో పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. గడిచిన 9 నెలల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులలో చిత్తశుద్ధి లోపించిందన్నారు. ఇంజినీర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. అప్పటికి పనులు ప్రారంభించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించడమే కారణమన్నారు. పనులు చేయకుండా, విధులు నిర్వహించకుండా ప్రభుత్వం నుంచి వేతనాలు ఎలా తీసుకుంటున్నారంటూ మండిపడ్డారు బాధ్యతలను విస్మరించడం మంచి పద్ధతి కాదన్నారు. చిన్నగంజాం మండలంలో 19 పనులు మంజూరు కాగా 11 పనులు మొదలు కాకపోవడం, 13 కల్వర్టు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం..

జగనన్న కాలనీలకు తాగునీటి సరఫరా పనులు పూర్తిచేయకపోవడంపై కలెక్టరు రంజిత్ బాషా అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని 283 జగనన్న లేఅవుట్లలోకి 235 పనులు మంజూరు కాగా కేవలం 13 పనులు పురోగతి సాధించడం ఏమిటని నిలదీశారు. 214 పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్నందుకైనా ఇంజినీర్లు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు సెప్టెంబరు 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమగ్ర ప్రణాళికతో ఇంజినీరింగ్ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.33 కోట్ల బిల్లులు విడుదలయ్యాయన్నారు. ప్రభుత్వ భవనాలకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. వేమూరు నియోజకవర్గంలో నిర్మాణ పనుల్లో జాప్యం ఉండరాదన్నారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.



ఆపరేషన్ విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోఖలే బృందం

సర్కారు సహృదయం

- సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో బైపాస్ సర్జరీలు
- నాటి ప్రభుత్వ నిర్దయతో ఆగిన శస్త్రచికిత్సలు
- సంక్షేమ పాలకుని కృషితో ప్రారంభం
- గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ గోఖలే సేవలు అందుబాటులోకి..



బైపాస్ సర్జరీ చేస్తున్న డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే బృందం

గుంటూరు మెడికల్: సంక్షేమ సర్కారు పేదల గుండెధైర్యమై నిలిచింది. గత ప్రభుత్వ నిర్దయతో ఆగిన గుండె శస్త్రచికిత్సలను మళ్లీ పునఃప్రారంభించింది. 600పైగా సర్జరీలు, నాలుగు గుండె మార్పిడి శస్త్రచికిత్సలతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన అపర సంజీవని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే చొరవతో మళ్లీ రోగుల గుండెల్లో సంతోషాలు పూయించి తన కీర్తిపతాకను సగర్వంగా రెపరెపలాడించేందుకు సిద్ధమైంది.

టీడీపీ ప్రభుత్వంలో కునారిల్లి..

గుంటూరు జీజీహెచ్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వసతుల్లేక కునారిల్లింది. ఆస్పత్రిలో పసికందును ఎలుక కొరికిన ఘటన మాయని మచ్చగా, అప్పటి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా నిలిచింది. ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లేలా చేసింది. ఈ క్రమంలో 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారు. వైద్య సిబ్బంది నియామకం, నూతన వైద్య పరికరాల కొనుగోలు ద్వారా జీజీహెచ్‌కు ఊపిరిపోశారు. దీంతో రోజుకు నాలుగువేలకుపైగా ఓపీతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్యశాలగా గుర్తింపు పొందింది.

విన్నవించినా పట్టించుకోని గత ప్రభుత్వం

ఎలుక కొరికి పసికందు మృత్యువాత పడిన ఘటనతో అప్రతిష్టపాలైన గత ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు సహృదయ ట్రస్టును పావుగా వినియోగించుకుంది. 2015లో సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు గుండె మార్పిడి సర్జన్ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ముందుకు రావడంతో మూడేళ్లపాటు 2018 వరకు సేవలు అందించేందుకు ఉత్తర్వులిచ్చింది. దీనివల్ల అప్పటివరకు ఉన్న అపఖ్యాతిని పోగొట్టుకోవాలని కుయుక్తి పన్నింది. సేవలు ఆరంభించిన డాక్టర్ గోఖలే సుమారు 600కుపైగా బైపాస్ సర్జరీలు, నాలుగు గుండె మార్పిడి సర్జరీలు నిర్వహించారు. సహృదయ ట్రస్టుతో కుదుర్చుకున్న ఒప్పందం ముగిసినా డాక్టర్ గోఖలే అదనంగా 11 నెలలపాటు ఉచితంగా సేవలందించారు. తమ ట్రస్టు సేవలను పొడిగించాలని గత టీడీపీ ప్రభుత్వానికి విన్నవించారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. దీంతో గోఖలే జీజీహెచ్ వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి గుండె ఆపరేషన్లు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు సంక్షేమ సర్కారు చొరవతో ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. సోమవారం డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో వైద్యులు గుంటూరుకు చెందిన రోగి కిషోర్‌కు తొలి బైపాస్ సర్జరీ దిగ్విజయంగా పూర్తిచేశారు.

రెగ్యులర్‌గా బైపాస్ సర్జరీలు

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతివారం రెగ్యులర్‌గా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుండె బైపాస్ సర్జరీలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు శిక్షణ ఇవ్వడంతోపాటు, సర్జరీలు చేసేందుకు తమకు ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. సర్జరీలు రెగ్యులర్‌గా జరిగేలా జీజీహెచ్ వైద్యులకు శిక్షణ ఇస్తాను. గతంలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న ఏడుకొండలు, హరిబాబుకు ప్రతినెలా రూ.3 లక్షల ఖరీదు చేసే మందులు సహృదయ ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. పేదలు సేవలను వినియోగించుకోవాలి.

– డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీలు



పాత గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చేపట్టామని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్(ఆర్డీ) శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డు కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఆర్డీ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డ్ అడ్మిన్, వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ అండ్ ఎడ్యుకేషన్, శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటి కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టామని పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్, మ్యూచువల్, విత్ ఇన్ డిస్ట్రిక్ట్ అదర్స్ కేటగిరిలో అంశాల ప్రాధాన్యంగా బదిలీలు జరిగాయని పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్ 38, ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యూచువల్ 70, అదర్స్ విభాగంలో 210 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి బదిలీ ఆమోద ఆర్డర్ అందించినట్టు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో రాజీవద్దు

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: దూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల అర్జీలు వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది ఇప్పటికే ప్రారంభమైన జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు వివరంగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో వచ్చిన 249 అర్జీలను జేసీతోపాటు అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివరామిరెడ్డి, వాణి, సాయిశ్రీ, జిల్లా అధికారులు పరిశీలించారు.

నా స్థలంలో వ్యర్థాలు వేశారు



నేను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని. నాకు పొన్నూరు మున్సిపల్ పరిధిలో 72.5 సెంట్ల భూమి ఉంది. అందులో సుమారు 5 సెంట్లలో మున్సిపల్ సిబ్బంది వ్యర్థాలు వేశారు. ఎన్నోసార్లు చెప్పినా వినడంలేదు. నాది రిజిస్ట్రేషన్ భూమి. సర్వేలోనూ నాకు అన్ని హక్కులూ ఉన్నాయని చెప్పారు. నాకు న్యాయం చేయండి.

– ఎద్దు ఇజ్రాయేల్, పొన్నూరు.

చెప్పాపెట్టకుండా విద్యుత్ కనెక్షన్ తొలగించారు



స్థానిక బ్రాడీపేటలోని చర్చి కాంపౌండ్‌లో 1985 నుంచి నాకు కేటాయించిన ఇంట్లో ఉంటున్నా. విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నా. ఇటీవల విద్యుత్ సిబ్బంది కనెక్షన్ తొలగించారు. అధికారులు చెప్పినా సిబ్బంది స్పందించడంలేదు. అనారోగ్యం వల్ల నాకు మాటపడిపోయింది. చెప్పుకోవడానికీ ఇబ్బందిగా ఉంది.

–డేవిడ్ విజయ్ కుమార్, గుంటూరు

స'లా'ం నేస్తం



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీ అయోధ్య, జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం, మురుగుడు, ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరి, కిలారి, శివకుమార్, మేయర్ మనోహర్

- అట్టహాసంగా వైఎస్సార్ లా నేస్తం నగదు జమ
- 234 మంది యువ న్యాయవాదులకు లబ్ధి
- రూ.7.20 లక్షల మేర ప్రయోజనం

గుంటూరు వెస్ట్: న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ లా నేస్తం పథకం బాగా ఉపకరిస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023–24 సంవత్సరానికి మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను బటన్ నొక్కి అర్హులైన యువ న్యాయవాదుల ఖాతాల్లోకి జమచేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో చేరిన వెంటనే చాలా మందికి ఆదాయం ఉండదని, వారు నిలదొక్కుకునేందుకు నెలకు రూ.5,000 చొప్పున మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోందని చెప్పారు. జిల్లాలో 234 మంది న్యాయవాదులకు రూ.70.20 లక్షలు జమ య్యాయని వివరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి రోశయ్య, మొహమ్మద్ ముస్తఫా, అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు మేయర్ కావటి మనోహర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, మండేపూడి పురుషోత్తం, ముంతాజ్ పఠాన్, లాలుపురం రాము, బత్తుల దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ లా నేస్తం పథకం మాలాంటి మహిళా న్యాయవాదులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. చదువు తర్వాత కూడా ఆర్థికంగా ఇంట్లో వారిపై ఆధార పడడం కష్టం. వరసగా రెండో ఏడాది కూడా నాకు డబ్బులు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– తురగా ఎంకే ప్రణీత, యువ న్యాయవాది, గుంటూరు

చేయూత అమోఘం



ఇప్పుడు న్యాయవాదులకు కేవలం ప్రాక్టీస్ మాత్రమే కాకుండా అనేక సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. వీటి కోసం నిరంతరం సాధన చేయడంతోపాటు పోటీ పరీక్షలు రాయాల్సిన అవసరముంటుంది. దీంతోపాటు న్యాయవాద వృత్తిలో తొలిదశలో ఆదాయం ఉండదు. అందుకే చాలా మంది ఈ వృత్తిలోకి రావడానికి ఆలోచిస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న చేయూత అమోఘం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

–వి.వెంకటేష్, యువ న్యాయవాది, గుంటూరు

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దు

- చట్ట పరిధిలోని వాటికి పరిష్కారం చూపండి
- సిబ్బందిని ఆదేశించిన అర్బన్ ఎస్పీ


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: గ్రామంలో కులబహిష్కరణ చేశారంటూ ఒకరు, డీఆర్‌డీఏ ఉన్నతాధికారిణి చేసిన మోసంపై మరొకరు ఇలా.. అర్బన్ ఎస్పీని కలసి తమ సమస్యలను బాధితులు విన్నవించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ అర్జీలను స్వీకరించారు. బాధితుల మొరను స్వయంగా ఆలకించారు. ఫిర్యాదిదారుల ఎదుటనే సంబంధిత సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్‌లో/ జూమ్ ద్వారా ఎస్పీ మాట్లాడారు. పోలీసులు చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని, స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాస రావు (క్రైం), డీఎస్పీలు సుభాష్ (ఎస్‌బీ), బాలసుందర్ (ట్రాఫిక్), కేసీహెచ్.రామారావు (దిశ) కూడా అర్జీలు స్వీకరించారు.

కాపాడే ప్రయత్నాలు..

కంతేరు గ్రామంలో దళితులపై దాడి జరిపిన వారిని కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ ఆరోపించారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితులపై పాశావికంగా దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగా దాడి చేయడమేగాక హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు.

గ్రామంలో బహిష్కరించారు

వెనిగండ్ల గ్రామ పరిధిలోని ఓ చర్చి కమిటీలో భర్త గతంలో సభ్యుడిగా ఉండేవారు. అయితే చర్చికి సంబంధించి లెక్కలు చూపించాలని కమిటీ నిర్వాహకులను అడిగాడు. దీంతో చర్చి కమిటీ తన భర్తను సభ్యుడిగా తొలగించి కుల బహిష్కరణ చేశారు. ఈ విషయాన్ని గ్రామంలో మైకు ద్వారా చాటింపు కూడా వేశారు. ఇక అప్పటి నుంచి గ్రామంలో స్థానికంగా ఏదైనా శుభ /అశుభ కార్యక్రమాలు జరిగినా తమ కుటుంబ సభ్యులను పిలవడం లేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. సంఘ పెద్దలు స్టేషన్ వద్దకు వచ్చి, తమ పరిధిలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి తీసుకొచ్చారు. అయితే ఇన్నాళ్లు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అందరూ మానసికంగా క్షోభను అనుభవిస్తున్నాం. భవిష్యత్‌లో కుమారుల వివాహాలు చేయాలన్నా ఇబ్బందులు తప్పవని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

– బి.పద్మ, వెనిగండ్ల, పెదకాకాని మండలం

ఉద్యోగం ఇప్పిస్తానని..

ఏడాది క్రితం డీఆర్‌డీఏలో పనిచేసే వ్యక్తి పరిచమయ్యాడు. సదరు వ్యక్తి తమను ఓ శాఖలో ఉన్నతాధికారి వద్దకు తీసుకెళ్లారు. ఆ శాఖలోని ఉన్నతాధికారిణి తన కుమారునికి ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. దీంతో ఆమెకు పలు దఫాలుగా రూ.2 లక్షలు చెల్లించాం. అయితే ఇప్పటి వరకు ఉద్యోగం ఊసెత్తడం లేదు. కనీసం డబ్బులు ఇవ్వమని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు.

– కె.సామ్రాజ్యం, ఏటీ అగ్రహారం జీరో వీధి

ఫొటోలు మార్ఫింగ్ చేసి..

సుమారు రెండేళ్ల క్రితం ఇంట్లోని సెల్‌ఫోన్ మరమ్మతులకు గురైంది. ఈ క్రమంలో మంగళగిరిలోని ఓ వ్యక్తి వద్దకు తీసుకెళ్లాం. అయితే మొబైల్ ఫోన్‌లోని కుటుంబ సభ్యుల్లోని మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరించడం మొదలెట్టాడు. ఈ క్రమంలో లక్షల రూపాయలను కాజేశాడు. దీనిపై స్థానిక పోలీసులకు, ప్రజాదర్బార్, స్పందనలో పలు మార్లు ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోలేదు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– మంగళగిరి వాసి

ఉల్లిపాయల మాటున.. మద్యం ఘాటు!

- ఎనిమిది లక్షల గోవా మద్యం పట్టివేత
- ముగ్గురి అరెస్ట్
- భారీగా మద్యం సీసాలు స్వాధీనం


మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఏఎస్పీ మహేష్

నగరంపాలెం: లక్షలు ఖరీదు చేసే మద్యం సీసాలను పొరుగు రాష్ట్రం నుంచి తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయించే ముగ్గురిని ఎస్‌ఈబీ (సెబ్) గుంటూరు–2 స్టేషన్, డీఎస్‌ఈఓ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.8 లక్షలు ఖరీదు చేసే 1,042 ఫుల్ బాటిల్ సీసాలను, లారీని సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని సెబ్–2 స్టేషన్ లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను గుంటూరు ఏఎస్పీ డీఎస్.మహేష్ వెల్లడించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో ఆదివారం మేడికొండూరు ఎస్‌ఎస్‌పీ కెనాల్ వద్ద ఎస్‌ఈబీ–2, డీఎస్‌ఈఓ పోలీసులు మకాం వేశారు. మేడికొండూరు నుంచి గుంటూరు వైపు వస్తున్న లారీని గుర్తించి నిలిపివేశారు. లారీలో ఉల్లిపాయలు ఉండగా, వాటి కింద పెద్ద అట్టపెట్టెలను గమనించారు. వీటిల్లో 87 అట్టపెట్టెల్లో 1,042 ఫుల్ బాటిల్ మద్యం సీసాలను గుర్తించి, గుంటూరు మోతీలాల్ నగర్ ఒకటో వీధిలో ఉంటున్న ఉదయగిరి ప్రసాద్ అలియాస్ శివప్రసాద్, శివనాగరాజుకాలనీలో ఉంటున్న చేబ్రోలు మండలం గుండావరం గ్రామ వాసి టి.బాజీబాబు, పల్నాడు జిల్లా మాచర్ల 11వ వార్డుకి చెందిన బండ్ల సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరం రుజువు కావడంతో రూ.8 లక్షలు విలువ చేసే గోవా మద్యం సీసాలను, లారీని సీజ్ చేసినట్లు ఏఎస్పీ చెప్పారు.

గత అయిదారు నెలలుగా ఉదయగిరి ప్రసాద్ అలియాస్ శివప్రసాద్ అనధికార మద్యం విక్రయాలు చేసేవాడని పోలీసులు గుర్తించారు. సొంత పెట్టుబడితో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. శివప్రసాద్‌కు వరుసైన బావమరిది సత్యనారాయణ, టి.బాజీబాబులు సహాయకులుగా పనిచేసేవారు. పలువురికి మద్యం సీసాలను విక్రయించే వారు. గతంలో శివప్రసాద్‌పై ప్రకాశం జిల్లాలో ఒక కేసు నమోదై ఉందని ఏఎస్పీ చెప్పారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ సొమ్ము సంపాదించాలనే దురాశతో పొరుగు రాష్ట్రం మద్యం సీసాలను తీసుకొచ్చి, విక్రయిస్తున్నట్లు చెప్పారు. పొరుగు రాష్ట్రాల మద్యం ఇక్కడ విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. కేసులో ప్రతిభ చూపిన సెబ్–2, డీఎస్‌ఈఓ సిబ్బందిని ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఏఈఎస్ కె.మణికంట, సీఐ కె.కర్ణ (సెబ్–2), ఎస్‌ఐ ఇ.కల్యాణ చక్రవర్తి, హెచ్‌సీ పీవీ.పోతురాజు, కానిస్టేబుళ్లు కె.నాగరాజు, బి.వీరాంజనేయులు, కె.పూర్ణ చంద్రరావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికే ప్రాధాన్యం : కలెక్టర్



గుంటూరు వెస్ట్: మహిళల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దీనిని అధికారులు ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలో అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అర్హులకు అందేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో రక్తహీనత పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో జేవీకే కిట్లు పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, కిచెన్ షెడ్లు నిర్మాణం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, డీఈఓ శైలజ, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, సీపీఓ శేషశ్రీ, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

తగిన డాక్యుమెంట్లు అందించాలి

ఏపీసీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం


మాట్లాడుతున్న కమిషనర్ కట్టా సింహాచలం

తాడికొండ: పట్టా భూమి, అసైన్డ్ భూములకు సంబంధించి అర్హత ఉండి కౌలు చెల్లింపులు జరగని రైతులకు కౌలు చెల్లింపులు చేసేందుకు తగిన డాక్యుమెంట్లు సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో అందజేయాలని ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం సూచించారు. సోమవారం తుళ్లూరు ఏపీ సీఆర్డీయే కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ ఓఎంపీ చిరంజీవితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టా భూములకు సంబంధించి కోర్టు కేసులు లేకుండా అర్హత ఉన్న రైతులు, అసైన్డ్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకుండా క్లియర్ కేసులకు సంబంధించి తగిన ప్రతిపాదనలు నాలుగు రోజుల్లోగా విజయవాడ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 6–8 గంటల వరకు అందుబాటులో ఉండి పెండింగ్‌లు క్లియర్ చేస్తారు. కనుక రైతులు సంబంధిత కార్యాలయాల్లో తగిన ఆధారాలు అందజేయాలని సూచించారు.

సైకిల్‌పై 15 రాష్ట్రాలు చుట్టేశాడు!

దేశంలో శాంతి నెలకొనాలని సైకిల్ యాత్ర చేపట్టిన కర్ణాటక వాసి


తెనాలి బోస్‌రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద విజయగోపాలకృష్ణ

తెనాలిరూరల్: దేశంలో శాంతి నెల కొనాలని, ఘర్షణలు లేకుండా ఉండాలని ప్రార్థిస్తూ ఆయన సైకిల్‌పై రాష్ట్రాలు చుట్టేస్తున్నారు. ప్రముఖ ఆలయాలను సందర్శించి దేవుళ్లను ప్రార్థిస్తున్నారు. జల, జంతు వన సంరక్షణ కోసం సైకిల్‌పై దేశ యాత్ర చేపట్టారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరుకు చెందిన విజయ్ గోపాలకృష్ణ దేశంలో శాంతి నెలకొనాలని కారుతూ సైకిల్ యాత్ర చేపట్టాలని నిర్ణయించుకున్నారు. గతేడాది మార్చిలో సింధనూరులో ఈ యాత్ర ప్రారంభించారు. అక్కడి నుండి బయలుదేరి కేరళ, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్, ఒడిసా రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం చుట్టేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర కొనసాగిస్తున్నారు. ఉదయం పర్యటనను ప్రారంభిస్తూ, మధ్యాహ్నం కొంత విశ్రాంతి తీసుకుంటూ అనంతరం యాత్రను కొనసాగిస్తున్నారు. ఘనాపూర్, తుల్జాపూర్, శిరిడి, నాసిక్, త్రయంబకేశ్వరం, నాందెడ్, బాసర, త్రివేణి, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హర్యానా, పంజాబ్, సింధు నది నది ప్రాంతాలు, పూరి జగన్నాథ ఆలయం వంటి ప్రముఖ ఆలయాలను సందర్శించారు. సోమవారం యాత్ర తెనాలికి చేరుకుంది. బోస్‌రోడ్డులోని సాయిబాబా ఆలయానికి వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 470 రోజులుగా యాత్ర కొనసాగుతోందని, ఇప్పటి వరకు 15 రాష్ట్రాల్లో పర్యటించి అనేక దర్శనీయ దేవాలయాలు, అడవులు, జంతువులు, 11 పుణ్య నదులను సందర్శించినట్లు తెలిపారు. తమ పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు మండలం కొమరవరని, 1971లో రాయచూరుకు వెళ్లి స్థిరపడినట్లు తెలిపారు. ప్రస్తుతం పొన్నూరు మీదుగా ఒంగోలు వెళుతున్నట్లు వివరించారు. ఎలాంటి మత విద్వేషాలు, ఘర్షణలు లేకుండా చూడాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి ప్రజలు స్థానిక సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతం పలుకుతున్నారని వారందరికీ రుణపడి ఉంటానన్నారు.

అండర్–7 చెస్ విజేతలు మౌళి, హర్ష


జిల్లా అధ్యక్షులు రవీంద్రరాజుతో చెస్‌లో విజయం సాధించిన చిన్నారులు


గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుజ్జనగుండ్లలోని గ్రీన్‌ల్యాండ్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–7 ఓపెన్ బాల బాలికల చెస్ పోటీల్లో బాలురల్లో ఎం.శశాంక్ మౌళా, కె.హర్ష, బాలికల్లో ఎఎస్ఎస్ఎస్ కావ్య, జి.హర్షిణిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందారని పోటీల నిర్వాహకురాలు షేక్ పర్వీన్ తెలిపారు. ఎంపికైన నలుగురిని ఈ నెల 28 నుంచి 30 వరకు విజయనగరంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్ రవీంద్ర రాజు, స్కూల్ ప్రిన్సిపల్ వైఎస్ రాజు అందజేసారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

- అకడమిక్ సెనెట్‌లో వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఆగస్టులో వర్సిటీ స్నాతకోత్సవం

ఏఎన్‌యూ: యూనివర్సిటీలో విద్య, పరిశోధనాంశాలతోపాటు విద్యార్థులకు నిరంతరం సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామన్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో సోమవారం జరిగిన యూనివర్సిటీ 87వ అకడమిక్ సెనెట్ సమావేశంలో వీసీ యూనివర్సిటీ సమగ్రాభివృద్ధి నివేదికను సమర్పించారు. రానున్న రోజుల్లో చేపట్టనున్న అంశాలను ప్రతిపాదించారు. పలు అంశాలకు అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవాలు కలిపి నిర్వహించే అంశానికి అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 11న విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. త్వరలో జరగబోతున్న నాక్ బృందం సందర్శనను సమిష్టిగా విజయవంతం చేసి యూనివర్సిటీకి అత్యుత్తమ గ్రేడ్ తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. రెక్టార్ ఆచార్య డా. పి. వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఏఎన్‌యూ మాజీ వీసీలు ఆచార్య బి బాలమోహన్ దాస్, ఆచార్య కె.వియన్నారావు, విశ్వ విద్యాలయ అకడమిక్ డీన్ ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి పలువురు అధికారులు, అకడమిక్ సెనెట్ సభ్యులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో పల్నాడు జిల్లా వాసుల ప్రతిభ


రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన వారితో కోచ్ సురేష్

సత్తెనపల్లి(ముప్పాళ్ల): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ సీనియర్ మెన్ మరియు ఉమెన్ పోటీల్లో పల్నాడు జిల్లా వాసులు ప్రతిభ కనపరిచి రెండు బంగారు, ఐదు వెండి, ఒక బ్రౌంజ్ సాధించినట్లు పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పసుపులేటి సురేష్ సోమవారం తెలిపారు. నెల్లూరు ఏసీ రెడ్డి స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ సీనియర్ మెన్, ఉమెన్ పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఈ బహుమతులు సాధించారన్నారు. పల్నాడు జిల్లా మెన్‌టీమ్ చాంపియన్‌షిప్ రెండో స్థానంతో పాటుగా పసుపులేటి వంశీకృష్ణ రాష్ట్రస్థాయిలో స్ట్రాంగ్‌మెన్‌గా రెండో స్థానం సాధించినట్లు వివరించారు. సీనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో రొంపిచర్లకు చెందిన ఎం.అనూష బంగారు పతకం, సిల్వర్ పతకం సాధించగా, 66 కేజీల విభాగంలో దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన ఎం.అశోక్‌కుమార్ బంగారు పతకం సాధించారన్నారు. 74 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ సిల్వర్, 83 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎన్.కె.నజీర్ బ్రౌంజ్ సాధించారు. 120 కేజీల విభాగంలో గుడిపూడికి చెందిన లింగిశెట్టి శివనాగేశ్వరరావు 2 సిల్వర్ పతకాలు సాధించారన్నారు. విజేతలను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, వైస్ ప్రెసిడెంట్ గుజ్జర్లపూడి ఆనంద్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, ఎస్కేజానీ, సయ్యద్ మస్తాన్ అభినందించారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

బాపట్ల అర్బన్: బాపట్ల సూర్యలంక రోడ్డులోని లోటస్ పాండ్‌లో రాష్ట్ర కబడ్డీ సంఘం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తాతా బసవ శంకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.ఈ.జగదీష్, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎస్.గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి విజయభాస్ రెడ్డి, ఎస్.రామచంద్రుడు, చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా కె.సి.మాధవ మూర్తి, కార్యదర్శిగా పి.పద్మజాబాల, కోశాధికారిగా మంజుల వెంకటేష్, జాయింట్ సెక్రెటరీలుగా ఆర్.రామ్ తేజ్ గౌడ్, జనార్ధన్ రావు, ఎస్.యానరాజు, డి. నాగాంజనేయరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అనగాని సురేష్ కార్యనిర్వాహక సభ్యులుగా ఆర్. గౌడ్, వై. దూర చంద్రరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, పి.దుర్గ అజయ్ కుమార్, ఎం.గంగాధర్, జె.విజయ్ ఆనందం, ఆర్.సుధాకర్‌లు ఎన్నికయ్యారు.

ఆర్‌వీఆర్ జేసీ కళాశాలకు డబుల్ 'ఎ' రేటింగ్


డబుల్ ఎ రేటింగ్ సర్టిఫికెట్‌ను చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఉన్నత విలువలతో కూడిన విద్యా విధానం, ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా విద్యా బోధన, వసతుల కల్పన తమ కళాశాల ముఖ్య ఉద్దేశమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్‌పీటీఈఎల్ ఐఐటీ మద్రాస్ నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్ సాధించిందన్నారు. జనవరి, ఏప్రిల్ మాసాల్లో ఐఐటీ మద్రాస్ నిర్వహించిన ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్ రావటం సంతోషకరమన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న 5633 చాప్టర్స్‌లో తమ కళాశాల లోకల్ చాప్టర్ జాతీయ స్థాయిలో రేటింగ్ సాధించినట్లు తెలిపారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన కోర్స్‌లకు 2743 మంది రిజిస్టర్ కాగా అందులో 33 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, 913 మంది విద్యార్థులు ఏలైట్ సర్టిఫికెట్‌ను, 336 మంది సిల్వర్ సర్టిఫికెట్‌ను, 77 మంది విద్యార్థులు టాపర్ సర్టిఫికెట్లను పొందారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎం వీపీ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఘనంగా స్పర్శ ఐదో వార్షికోత్సవం


ఐ లవ్ జీఎంసీ పార్కును ప్రారంభిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: పేదలకు తమవంతుగా సహాయం చేయాలనే మంచి ఆలోచనతో గుంటూరు వైద్య కళాశాల వైద్య విద్యార్థులు వినూత్నంగా విరాళాలు సేకరించేందుకు నూతనంగా ఏర్పడిన స్పర్శ స్వచ్ఛంద సంస్థ ఐదో వార్షికోత్సవం సోమవారం వైద్య కళాశాలలో ఘనంగా జరిగాయి. వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. విద్యార్థి దశలోనే సేవ చేయాలనే మంచి ఆలోచన కలిగి ఉండటం చాలా శుభ పరిణామమని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులుగా, వైద్యులుగా సమాజానికి సేవలందిస్తూ పేదలకు ప్రత్యేకంగా కావల్సిన అవసరాలను తీర్చేందుకు సైతం వైద్య విద్యార్థులు కొంత విరాళాలు సేకరించి, కొంత స్వచ్ఛందంగా ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో అకాల మృత్యువుకు గురైన వైద్య విద్యార్థి భరత్ పేరు మీద గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఐలవ్ జీఎంసీ పార్కును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ ప్రారంభించారు.

- **సంచుల షార్ట్ టెండర్లకు ఆహ్వానం**

నరసరావుపేట: వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌కిట్లను జిల్లాలోని అంగన్‌డీ కేంద్రాలకు సరఫరా చేసేందుకు కావాల్సిన సంచుల కోసం షార్టు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, కొనుగోలు కమిటీ చైర్మన్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.